15

# సద్గురుశక్తి మేల్కొనిన కర్మయోగి

## శ్రీశేషుదేవులు

శ్రీశేషుబాబు గారిలో సర్వజనుల కష్టములను తొలగించాలనే ఆతృత పరాకాష్టకు చేరిపోవుటచే ఆయనలో సద్గురుశక్తి మేల్కొనినారు. 1997లో సద్గురుశక్తి మేల్కొనినప్పటి నుండి శ్రీ శేషుబాబు గారి దేహమును ఉపయోగించుకుంటూ సద్గురువే కర్మ చేయుచున్నారు. సద్గురుశక్తి మేల్కొనిన దేహమునకు దేహకర్మలు ఏమీ ఉండవు. ఆయన కర్మలన్నీ సద్గురుకర్మలే అయిఉంటాయి. దేహదర్మములు ఏమీ ఉండవు. అసూయ, ద్వేషము, కోపము వంటి దేహ అధర్మకర్మలలో కూడా సద్గురువే ఉండి అందరికీ సేవ చేసేస్తుంటారు. కావున ఆ దేహమునకు 'కోపపడుట పాపము' అనేటటువంటి దేహధర్మములు ఏమీ వర్తించవు. సద్గురుదేహము ఎవరిని అభిమానించినా, ద్వేషించినా వారికి లాభమే కలుగుతుంది. అంతేకాదు సద్గురుదేహమును ఎవరైనా అభిమానించినను, ఎవరైనా ద్వేషించినను వారికి కూడా సద్గురుశక్తి సేవయే చేసేస్తారు. సద్గురుశక్తి యొక్క తత్వమును గూర్చి కొద్దిగా మననం చేసుకుందాము.

ప్రేమస్వరూపుడైన భగవంతుడు సృష్టినంతటినీ క్రమపద్ధతిలో సృష్టిచేసియున్నారు. ఆయన ఏర్పరచిన సత్యసూత్రములను బట్టియే క్రమపద్ధతిలోనే సృష్టియంతా నడచుచున్నది. సృష్టిలో ఎవరికి ఏ బాధ, ఏ నష్టము కలుగుచున్నా అది న్యాయమైనదే అయియుంటుంది. కర్మ ద్వారాగానీ, అభిమాన ద్వేషముల ద్వారాగానీ వారు చేసుకొనియున్న పాపఫలమునే వారు అనుభవించుచున్నారు. ఒకవేళ ఎవరైనా పాపము చేయకుండా బాధను అనుభవిస్తే వారికి తత్ఫలముగా తదుపరి వంద రెట్లు లాభం వచ్చేస్తుంది. కావున సృష్టిలో ప్రతీది సక్రమముగానే ఏర్పరచబడియున్నది. కావున భగవంతునిచే క్రమపద్ధతిలో సృష్టించబడిన సృష్టిలో మరల భగవంతుడు కలుగచేసుకోవలసిన అవసరము ఏమీ ఉండదు. మానవుని అతి స్వల్పమైన దేహజీవిత కాలము కంటే, అత్యధికమైన ఆత్మజీవితకాలము అవతారుడు స్పష్టముగా చూస్తూ ఉంటారు. ఒక మనిషి మరణించి దేహాన్ని వదిలేస్తే తదుపరి అతడు ఆత్మ రూపములో మరల అవతారుని వద్దకే చేరుకుంటాడు. అతడు జీవించియున్నప్పుడు, మరణించినాక కూడా అతని ఆత్మను అవతారుడు ఒకే విధముగా చూస్తూయుంటారు. కావున అవతారునికి జీవనము, మరణము అనువాటిలో భేదమేమీ కనిపించదు. సృష్టియంతా తాను సృష్టించిన క్రమపద్ధతిలోనే నడుచుచున్నది కాబట్టి భగవంతునికి ఎవరికో కలుగుచున్న దఃఖము, అశాంతి, బాధ, మరణము వంటివాటిని తొలగించాలనే అతృత ఏమీ ఉండదు. వాటిని తొలగించుకునే సూత్రాలను, మార్గాలను భగవంతుడు సృష్టిక్రమములోనే ఏర్పరచియున్నారు. కావున భగవంతుడు తన సృష్టిలో కలుగచేసుకోవాలనుకోరు.

continue...

కానీ దేహము యొక్క బాధలను, దుఃఖములను తొలగించి వారికి సుఖములను లాభములను ప్రసాదింపచేయాలని ఆతృత చెందునట్టి, అలాగ చేయగలిగిన శక్తి, అర్హత కలిగినట్టి సద్గురుశక్తిని భగవంతుడు తన సృష్టిక్రమములోనే ఏర్పరచియున్నారు. సద్గురువులో జాలి, ఆత్మవిమర్శ, వైరాగ్యములనెడి మూడు దైవీశక్తులు మేల్కొనియుంటాయి. సద్గురువు జీవులందరి యెడల జాలితో వారి బాధలను చూచి తట్టుకోలేరు. ఎదుటివారి దురదృష్టాన్ని తాను తీసేసుకుని, తన అదృష్టాన్ని వారికి ఇచ్చేసే గుణమును సద్గురువు కలిగియుంటారు.సద్గురువు ఆత్మవిమర్శతో ఏ తప్పునైనా వెంటనే 24 గంటలలోపే తెలుసుకునే గుణమును కలిగియుంటారు. నష్టము కలుగుచున్నాగానీ భగవంతుడినే దృఢముగా నమ్మే గుణమును సద్గురువు కలిగియుంటారు. తాను చేసే మంచిని, సేవను బహిర్గతము కానీయకుండా కుడిచేయి చేయు ధర్మము ఎడమ చేయికి కూడా తెలియనంత రహస్యముగా చేసే గుణమును సద్గురువు కలిగియుంటారు. సత్యమే భగవంతుడు. సృష్టిని క్రమపద్ధతిలో నడిపించుటకు భగవంతుడు ఏర్పరచిన సత్యసూత్రములు భగవంతుని స్వరూపమే అయియున్నవి. సత్యసూత్రములు సర్వజనులకు సుఖమును కలిగించునవైయున్నవి. అట్టి సత్యమును అందరికీ తెలియచేయాలనే ఆతృతతో కష్ట నష్టములను లెక్క చేయకుండా నిద్రాహారములను పట్టించుకోకుండా నిష్పక్షపాతముగా, నిర్మొహమాటముగా సత్యబోధను అందరికీ తెలియచేసే గుణమును సద్గురువు కలిగియుంటారు. ఇటువంటి అనేక మహత్తర గుణములను సద్గురువు కలిగియుంటారు. అట్టి సద్గురుశక్తి శ్రీ శేషబాబుగారిలో 1972లో మేల్కొని, 1998లో అవతారుడు మేల్కొనే వరకు శ్రీ శేషబాబు గారి దేహమును ఉపయోగించుకుంటూ సద్గురు కర్మలనే చేసియున్నారు. జీవులందరి దుఃఖములను తొలగించి సుఖములను ప్రసాదించగల శక్తి, అర్హత సద్గురువు కలిగియుంటారు. సద్గురువు ఏ దేహములో మేల్కొనియుంటారో ఆ దేహము తనయొక్క అదృష్టఫలములన్నీ ఇతరులకు ఇచ్చేస్తూ, ఇతరుల యొక్క పాపఫలమగు దురదృష్ట ఫలములన్నీ తాను స్వీకరించి మోసేస్తుంది.

శ్రీ శేషబాబు గారిలో సద్గురుశక్తి మేల్కొనిన పిదప, ఆయన దేహకర్మలన్నీ శూన్యమైపోయి ఆయన కర్మలన్నీ సద్గురుకర్మలుగా మారిపోయినవి. సద్గురు కర్మలవలన ఆయన ప్రవర్తన సద్గురు చిత్తప్రకారముగా మారిపోయినది. శ్రీ శేషబాబు గారు చిన్నతనము నుండి నిష్కపట, పరిశుద్ధ ప్రవర్తననే కలిగియుండేవారు. అపరిశుద్ధమైన మాయా పరిస్థితులను చూస్తే సహించలేకపోయేవారు. కీర్తి, కామము, కనకముల యెడల పూర్తిగా అయిష్టతను కలిగియుండేవారు. ధనము మాయ అనే భావముతో ధనమును చూచుట కూడా భరించలేక పోయేవారు. అంతటి సత్వగుణుడైన ఆయన మనస్సు సంపూర్ణముగా సత్వగుణమునే ఇష్టపడుచున్నప్పటికీ తన మనస్సును లెక్కచేయకుండా సద్గురువు చిత్త ప్రకారమే సంపూర్ణముగా నడచినారు. భగవంతుడు తనలో మేల్కొల్పిన సద్గురుశక్తిని భగవంతుని యొక్క ఆజ్ఞగా భావించినారు. తన మనస్సును, బుద్ధిని, అభీష్టమును అన్నింటినీ సద్గురుశక్తి పాదముల వద్ద అర్పించేసినారు. సద్గురుశక్తి ఎలా నడిపిస్తే అలాగ నడిచినారు. జీవితమంతా సద్గురుశక్తికే అంకితమై సద్గురుకర్మలనే సంపూర్ణముగా ఆచరించుచూ కూడా సామాన్యమానవునివలెనే లోకానికి కనిపిస్తూ సద్గురుసేవాకర్మలన్నింటినీ రహస్యము చేసుకుని ఆదర్శముగా జీవించినారు.



continue...

శ్రీకృష్ణపరమాత్మ సంపూర్ణముగా సత్వగుణుడు, బ్రహ్మ చారియు అయియున్నారు. భగవంతుని ఆజ్ఞమేరకు ఆయన తనకిష్టమైన సత్వగుణమును విడనాడి భగవంతుని చిత్తప్రకారముగా మాయాకర్మలు ఆచరించి లోకమునకంతటికీ సేవ చేసియున్నారు. శ్రీకృష్ణపరమాత్మతో ఎవ్వరు బాహ్యసాంగత్యము చేసినా గానీ దానివలన వారు బాహ్యలాభమును, ఆత్మాభివృద్ధిని పొందేస్తారు. కావుననే శ్రీకృష్ణపరమాత్మ అన్ని రకాలైన మాయావ్యవహారాలలోకి, సర్వవిధాలైన బాహ్యపరిస్థితులలోకి వెళ్ళిపోయి అందరికీ తనతో సాంగత్యము చేసే అవకాశము కలిగించినారు. తనతో సాంగత్యము చేసినవారందరికీ స్వర్గఫలములను, ఆత్మాభివృద్ధిని ప్రసాదించినారు. శ్రీకృష్ణపరమాత్మ శ్రీబుద్ధభగవానుని వలె పరిశుద్ధముగా చెట్టుక్రింద కూర్చొనియుండి గోపికలను పిలిస్తే వారు దగ్గరకు రారు. కావుననే ఆయన కూడా గోపికల వలెనే శృంగారపురుషునిగా మారిపోయి వారున్న మాయా పరిస్థితులలోనికి తాను వెళ్ళిపోయి వారికి తనతో సాంగత్యము చేసే భాగ్యాన్ని కలిగించినారు. ఆ సాంగత్యము వలన గోపికలు మహర్షి ఆత్మలుగా మార్పుచెంది ఆత్మాభివృద్ధిని పొందినారు. మహా పరాక్రమవంతులు, రాజకీయనాయకులు అగు పాండవులలో పరమాత్మ తాను కూడా రాజకీయనాయకుని వలె కలిసిపోయి వారి మాయావ్యవహారాలలోకి వెళ్ళిపోయి, వారికి తనతో సాంగత్యము చేసే భాగ్యమును ప్రసాదించి వారికి బాహ్యలాభమును, ఆత్మాభివృద్ధిని కలిగించినారు. శ్రీ బుద్ధభగవానుడు పరిశుద్ధ పరిస్థితులలోనే నిలిచియుంటారు. ఆయన వద్దకు సత్వగుణులే వస్తారు. ఆయన దగ్గరకు వచ్చిన వారికే భగవంతునితో సాంగత్యము చేసే అవకాశము కలుగుతుంది. కానీ శ్రీకృష్ణపరమాత్మ అంతరంగము కూడా శ్రీబుద్ధభగవానుని యంతటి పరిశుద్ధతనే కలిగియుంటుంది. అయినను శ్రీకృష్ణపరమాత్మ సత్వగుణ, రజోగుణ, తమోగుణ మాయాపరిస్థితులన్నింటిలోకి వెళ్ళిపోయి అందరికీ తనతో సాంగత్యము చేసే అవకాశమును కలిగించినారు. ఎక్కువ మందికి భగవంతుని యొక్క సాంగత్యమును సేవను గ్రహించే భాగ్యమును ప్రసాదించినారు.

అదే విధముగా సత్వగుణప్రియులైన శ్రీశేషబాబు గారు తన ఇష్టమును పూర్తిగా విడనాడి మనో, వాక్, కర్మలను సంపూర్ణముగా సద్గురుశక్తికే అంకితము చేసి జీవించినారు. శ్రీ శేషబాబు గారు చిన్నతనము నుండి ఎంతో ఇష్టముగా భక్తిపాటలు పాడుచూ అందుకనుగుణముగా నృత్యములు చేస్తూ ఉండేవారు. ఆయన జీవితమంతా 'శ్రీ చైతన్య మహాప్రభువు' వలె సన్యాసిగ ఉంటూ భక్తిపాటలు పాడుకుంటూ, నృత్యములు చేస్తూ దైవసంకీర్తనతో జీవితమంతా గడపాలని ఎంతగానో ఆశ పడేవారు. కానీ సద్గురుచిత్తము కొరకు తన ఇష్టమును పూర్తిగా విడనాడి గృహస్థాశ్రమమును



continue..

స్వీకరించినారు. తనకు అయిష్టమగు కీర్తి, కామము, కనకములను ధరించినారు. ఎక్కువ మందికి దైవీసేవ చేయుటకొరకు వారి వారి మాయాపరిస్థితులలోనికి తాను కూడా వెళ్ళిపోయి వారికి తనతో సాంగత్యము చేసే అవకాశమును కలిగించినారు. తన సాంగత్యము ద్వారా తనలోని ఆత్మఫలములను స్వర్గఫలములను ఎదుటివారికి ప్రసాదించి ఆత్మాభివృద్ధిని కలిగించేవారు. ఎదుటివారిలోని దురదృష్టములను చెడుసంస్కారములను తాను స్వీకరించి, తనలోని ఆత్మవిమర్శశక్తి ద్వారా వాటిని నశింపచేసేవారు. ఇతరులకు సద్గురుసేవ చేయుట కొరకు మాయలోనికి వెళ్ళి మాయను ధరించియుండి కూడా శ్రీకృష్ణపరమాత్మవలె అంతరంగమందు సంపూర్ణముగా పరిశుద్ధతనే కలిగియుండి జీవించిన కర్మయోగి శ్రీ శేషుబాబు గారు. శ్రీ శేషుబాబు గారి ప్రతి కర్మయు సద్గురుశక్తి కర్మయే అయియున్నది.

శ్రీ శేషుబాబు గారి జీవితములో తారసపడిన ప్రతివ్యక్తి యొక్క దురదృష్టమును, అసమర్థతను, పిరికితనమును, నష్టమును సద్గురుశక్తితో తమ దేహముపైకి స్వీకరించి అనుభవించేవారు. జాలి, వైరాగ్యము, అత్మవిమర్శలు మేల్కొనియున్న మహోన్నత మైన ఆత్మస్థితిని కలిగియున్న శ్రీ శేషుబాబు గారి చుట్టూ అదృష్టము, స్వర్గఫలములు అన్నీ తిరుగుతూ ఉంటాయి. తమ అదృష్టములన్నింటినీ సద్గురుశక్తితో ఇతరులకు పంచిపెట్టేసేవారు. అందరి దురదృష్టాలు తమ దేహముపై పడిపోవుటచేత చూచే వారందరూ అయనను దురదృష్టవంతునిగ, అసమర్థునిగ, పిరికివానిగ, తెలివితక్కువవానిగ, మిత్రద్రోహిగ ఎన్నో విధాలుగా దూషిస్తున్నా, నిందిస్తున్నా శ్రీ శేషుబాబు గారికి భగవంతునిపై గల నమ్మకము అణుమాత్రమైనా సడలేది కాదు. ఎంతటి దురదృష్టకరమైన పరిస్థితులు చుట్టుముట్టినా కూడా, నా పాపము వల్లనే నాకు బాధ కలుగుచున్నది. భగవంతుని ప్రేమవల్లనే నాకు రావలసియున్న వంద పాళ్ళు బాధలో తొంబైపాళ్ళు కొట్టి వేయబడుచున్నది అనే సత్యసూత్రమును గట్టిగా నమ్మేవారు. దేవుడిని నమ్మగానే అప్పటి వరకు ఉన్న అదృష్టజీవితమంతా తొలగిపోయి ఊహించశక్యముకాని దురదృష్టాలన్నీ మీదకొచ్చి పడిపోయినా కూడా సంపూర్ణముగా భగవంతుడినే నమ్ముతూ దృఢముగా నిలిచియుండుట శ్రీ శేషుబాబు గారిలోని సద్గురు లక్షణమే అయియున్నది. ఆత్మవిమర్శ ప్రధానులైన శ్రీ శేషుబాబుగారు ఎవ్వరి యెడల ఏ తప్పు చేయరు. ప్రతిక్షణము తన దేహ, మనో, ఆత్మలను విమర్శించుకుంటూ తనని తాను అందరికంటే తక్కువ వాని గానే భావిస్తూ ఉండేవారు. తప్పు చేసిన ఇరవైనాలుగు గంటలలోపే తప్పును గుర్తించుకొనే సద్గురు లక్షణమును సంపూర్ణముగా ఆచరించెడివారు.

సత్యజ్ఞానమును బోధించుట అనే సద్గురులక్షణము శ్రీ శేషుబాబు గారికి అత్యంత ప్రీతిపాత్రముగ ఉండేది. నిద్రాహారములు మరిచిపోయి ఎప్పుడూ సత్యమును బోధిస్తూనే ఉండగలిగేవారు. ఎప్పుడూ, ఎవ్వరి కోసము, ఎట్టి పరిస్థితిలోను ఏ ప్రలోభముచేత గానీ సత్యసూత్రమును ఎన్నడూ మార్చి చెప్పలేదు. సత్యమును ఉన్నది ఉన్నట్లుగ చెప్పెడి వారు. తనలోని, తనవారిలోని ఎంత చిన్న తప్పునైనా సహించేవారు కాదు. ఎవరు అయనకు ఎక్కువ సన్నిహితులుగ ఉంటారో వారిలోని తప్పులను మరింత ఎక్కువగా విమర్శించే వారు. దూరము నుంచి చూచేవారికి శ్రీ శేషుబాబు గారు శిష్యులను బాగా పొగుడుతారేమో అందుకే శిష్యులు సేవ చేస్తారేమో

continue..

అనే సందేహం కలిగే అవకాశమున్నది. కానీ శ్రీ శేషబాబు గారికి ఎవరు ఎక్కువ సేవ చేస్తారో వారిలోని తప్పులను మరింత ఎక్కువగా విమర్శించేవారు. ఇతను నాకు సేవ చేస్తున్నాడు కదా! ఇతనిని విమర్శిస్తే కోపము వచ్చి సేవ చేయడము మానేస్తాడేమో అని ఏనాడూ ఆలోచించేవారు కాదు. శ్రీ శేషబాబు గారితో జీవితకాలమంతా అత్యంత సన్నిహితునిగ జీవించిన మేష్టారు శ్రీ శేషబాబు గారితో అందరికంటే ఎక్కువగా విమర్శింపబడినవారైయున్నారు. మేష్టారు ఆ విమర్శను శ్రీ గురుదేవుల ఆత్మవిమర్శ ప్రసాదముగా ఎంచి ఆనందముగా స్వీకరించిన ధన్యజీవి అయియున్నారు. శ్రీ శేషబాబుగారు తమ జీవితకాలములో ఎట్టి బాహ్యలాభములు ఆశించి ఎవ్వరినీ పొగిడియుండలేదు. అందరికీ సత్యమునే చెప్పియున్నారు. ఆయన నాలుకతో భగవంతుడిని ఒక్కడినే పొగడినారు, కీర్తించినారు కాబట్టి వారి నాలుక పరిశుద్ధమైనదైయున్నది.

శ్రీ గురుదేవులు 1998లో తనలో అవతారుడు మేల్కొనిన తదుపరి కాలములో తనలో పనిచేసియున్న సద్గురుశక్తిని గూర్చి ఈ విధముగా చెప్పియున్నారు. "నా దేహము మనుష్యదేహము కాదు. ఈ దేహము సద్గురువు యొక్క మనస్సు అయియున్నది. ఈ మనస్సు సద్గురువు యొక్క ఆత్మ అయియున్నది, ఈ ఆత్మ భగవంతుడే అయియున్నది. 1972లో ఈ దేహమునందు సద్గురుశక్తి మేల్కొనినారు. అప్పటి నుండి ఈ దేహానికి దురదృష్టాలు ప్రారంభమైనవి. సద్గురువు ఈ దేహములో ఉండి కర్మ చేస్తూ, ఈ దేహానికి తారసపడిన ప్రతి ఒక్కరి సంస్కారములను ఈ దేహముపైకి స్వీకరించేసేవారు. సద్గురువు లోకము యొక్క అశాంతి, దుఃఖము, దురదృష్టము వంటి నరకమంతా స్వీకరించేసి లోకానికి స్వర్గాన్ని ప్రసాదించేసేవారు. ఏ దేహియు కూడా అకారణముగా అంతటి నష్టాన్ని మోయుటకు అంగీకరించరు. కానీ నాకు తెలియకుండానే సద్గురువు నాలో ఉండి అట్టి కర్మ చేసేసేవారు. ఆత్మవిమర్శ వలన నాలో సద్గురుశక్తి ఉన్న విషయం నాకు తెలిసేది కాదు. నా పాపఫలముగానే నేను నష్టమును అనుభవించుచున్నానని భ్రమించేవాడిని. లోకములో అందరికంటే నేనే పాపాత్ముడినని, అందుకే అందరికంటే దురదృష్టమును అనుభవించుచున్నానని భావిస్తూ పశ్చాత్తాపపడుచూ ఉండేవాడిని. ఆ సమయములో నన్నెరిగినవారందరూ గాలిలో దీపం పెట్టి దేవుడే దిక్కు అంటున్నాడు. అందుకే శేషబాబు దీపం ఆరిపోవుచున్నది. అందరికంటే నష్టపోవుచున్నాడు అనేవారు. ఆ సమయములో నా చెల్లెలు దేవి, అన్నయ్యా దేవుని నమ్మినవారికే ఎక్కువ కష్టాలు వస్తాయని భక్తుల చరిత్రలలో ఉన్నది. నీవు కూడా దేవుని నమ్ముట చేతనే ఇన్ని కష్టాలపాలగుచున్నావు అని బాధపడుతూ చెప్పినది. ఎవ్వరు ఎన్ని విధాలుగా చెప్పినా గానీ దైవము యెడల గల విశ్వాసము నాలో అణుమాత్రమైనా నడలలేదు. నా పాపఫలమే నన్ను శిక్షించుచున్నదని, భగవంతుని కరుణయే నా పాపాగ్ని నుండి నన్ను రక్షించుచున్నదని సంపూర్ణముగా విశ్వసించేవాడిని.

సద్గురుశక్తి ఏ దేహమునైతే ఉపయోగించుకుంటుందో ఆ దేహానికి కవచములా ఉండి రక్షిస్తుంది. ఆ దేహమునకు అపకారము చేయాలనే దుర్బుద్ధితో ఎవ్వరు దగ్గరకు వచ్చినా వారిని శిక్షించి తరిమేస్తుంది. ఆ దేహమును ధరించియున్న ఆత్మకు గొప్ప ఆత్మాభివృద్ధిని కలిగింపచేస్తుంది. అందరి దురదృష్టములు, పిరికితనములు, అసమర్థతలు అన్నీ ఈ దేహముపై పడిపోయేవి. వాటినన్నింటినీ ఈ దేహము అనుభవించేది. కానీ అవి ఈ మనస్సును గానీ, ఈ ఆత్మను గానీ అంటేవి కావు. నా దేహానికి కలిగే దురదృష్టాలే పైకి కనిపించేవి. కానీ దేహముపైకి ఒక్కొక్క

continue...

స్థాయిలో దురదృష్టాలు వస్తుంటే, అదే సమయములో నా ఆత్మ అభివృద్ధి చెందుచూ ఒక్కొక్క స్థాయిని దాటేస్తూయుండేది. దేహమునకు వచ్చే దురదృష్టాలు, దుఃఖాలు అన్నీ తాత్కాలికమైనవే. సద్గురుశక్తి మేల్కొనియున్న దేహముపై పడే బాధలు, దుఃఖాలు ఏవీ మనస్సు వరకు చేరవు, దేహముతోనే ఆగిపోతాయి. ఆ దేహబాధల వలన ఆత్మ అత్యంత వేగముగా అభివృద్ధి చెందుచూ, ఆ ఆత్మ నుండి పుట్టే ఆనందమే మనస్సును చేరుతుంది. సద్గురు శక్తి వలన నా దేహముపైకి వచ్చే దురదృష్టాలు పెరిగేకొద్దీ నా ఆత్మ మరింత వేగముగా ఆత్మాభివృద్ధి చెందుచూ ఇప్పటికి భగవంతుడే మేల్కొనిన పరమాత్మగా మారిపోయినది. భగవంతుడు నాలో మేల్కొనిన పిదపనే నాకీ సత్యము అవగతమైనది. ఇంతకాలముగా నేను నా దేహపాపకర్మల వల్లనే బాధపడుచున్నానని భావించినదంతా నా భ్రమయేనని, నా దేహకర్మలనేవి 1972 కి ముందే నశించిపోయినవని, అప్పటినుండి నా దేహము వెనుక ఉండి సద్గురువే కర్మ చేయుచున్నారనే సత్యము అవగతమైనది. 1972లో నాలో సద్గురుశక్తి మేల్కొనినప్పటి నుండి నాకు బాహ్య దేహకర్మలు గానీ, దేహము వెనుక సంస్కారములచేత ఏర్పరచబడే స్థూలదేహము గానీ లేవు. నా స్థూల శరీరము 1972కు ముందే నశించిపోయినది. స్థూల శరీరము స్థానములో సద్గురుశక్తియే ఉండి ఈ దేహమును ఉపయోగించుకుంటూ కర్మ చేయుచున్నారు. కావున ఈ దేహము కోపపడుచున్నా, ద్వేషిస్తున్నా, అసూయ చెందుచున్నా, అభిమానిస్తున్నా, ఇతరులకు బాహ్యాన్ని ఇస్తున్నా, ఇతరుల నుండి బాహ్యసేవలు స్వీకరిస్తున్నా ఏమి చేస్తున్నా గానీ అది సద్గురుకర్మయే అగుచున్నది. ఆ కర్మల ద్వారా అందరికీ సద్గురుసేవనే ప్రసాదించుచున్నది.

గతజన్మలోనే నా ఆత్మ సద్గురుస్థితిలో పరిపూర్ణమై ఆత్మవిమర్శను సంపూర్ణముగా కలిగియున్నది. కావున ఈ జన్మలో పుట్టుకతోనే సంపూర్ణముగా ఆత్మవిమర్శను కలిగియుండియే జన్మించియున్నాను. ఏ దేహమైనా స్వల్పమైన ఆత్మ విమర్శను కలిగియుంటేనే ఆ దేహములోని దుర్గుణములన్నీ దహించుకుపోతాయి. ఆత్మవిమర్శను సంపూర్ణముగా కలిగియున్న ఈ దేహమునకు అసూయ గానీ అహంకారము గానీ, ద్వేషము గానీ, కోపము గానీ, ఆశ గానీ, కోరిక గానీ, విషయాసక్తి గానీ అణుమాత్రమైనా లేవు. సద్గురుశక్తియే ఈ దేహము వెనుక ఉండి ఇతరులకు సేవ చేసేసినది. ఇతరుల దుస్సంస్కారములను ఈ దేహము స్వీకరించి ఈ దేహము యొక్క సత్సంస్కారములను ఇతరులకు దానము చేసినది. నేను కోపపడినా, అసూయ చెందినా, ఆశ పడినా, అహంకరించినా అవి అన్నీ సద్గురుకర్మలే అయివున్నవి. నా పుట్టుక నుండి ఇప్పటి వరకు నావలన ఎవ్వరికీ అపకారముగానీ, నష్టముగానీ కలుగలేదు. నావలన అందరికీ లాభము, సేవయే జరిగియున్నది.

అవతారుడు మేల్కొనిన తరువాత సద్గురుశక్తియే కర్మ చేయుచున్నారనే సత్యము అవగతమైనది. కానీ సద్గురుకర్మ మాత్రము ఆగుటలేదు. అవతారుని ద్వారా ఆకారమండలి, నిరాకారమండలి సమస్త ఆత్మలకు స్వర్గమును, విశ్రాంతిని కలుగుచేసేయాలనే ఆతృత సద్గురువులో మరింతగా పెరిగిపోయి, సద్గురుశక్తి శ్రీ నరసింహస్వామిలాగ మరింతగా విజృంభించేస్తున్నారు. హిరణ్యకశిపుని దేహాన్ని చీల్చివేసి ఆత్మరూపము కల్పించి, ఆత్మస్థితిలో ఆయనకు పరమాత్మ దర్శనము కలిగించి అనుగ్రహించిన శ్రీ నరసింహస్వామి వారు కూడా సద్గురుగుణమగు జాలియొక్క అవతారమే అయియున్నారు. లోకముయొక్క పాపభారమంతా తొలగిస్తూ లోకజనులందరికీ స్వర్గసేవలను అపరిమితముగా అనుగ్రహించుచున్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారు కూడా సద్గురుగుణమగు జాలియొక్క అవతారమే అయియున్నారు. అయితే మానవునిలో యుగమునకొకమారు భగవంతుడు మేల్కొనే అవకాశమెలాగున్నదో అలాగే జాలిలో కూడా ఎప్పుడైనా భగవంతుడు మేల్కొనే అవకాశమున్నది.



continue...

అవతారుడు మేల్కొనిన పిదప కూడా సద్గురుకర్మ కొనసాగించుమని సద్గురుశక్తి బ్రతిమాలుచునే యుంటారు. నికృష్టులగు వానరులను ఉద్ధరించాలనే సద్గురుకర్మ వల్లనే శ్రీరాముడు అరణ్యవాసబాధను అనుభవించినారు. ప్రజలందరికీ అద్భుతఫలాలను అందీయాలనే సద్గురకర్మ వల్లనే శ్రీ యేసుక్రీస్తు శిలువబాధను అనుభవించినారు. సద్గురు కర్మ వల్లనే శ్రీ మెహర్‌బాబా చివరిదశలో వ్యాధిభారాన్ని మోసినారు. భగవంతుడు మేల్కొనిన ఆత్మ దేహమును విడచిన తరువాత అట్టి ఆత్మకు ఎట్టి సంస్కారములు ఉండవు. అట్టి అవతారుని ఆత్మ భగవంతుడే అయియుండి భగవంతునిలోనే కలసిపోతారు. భగవంతునిలో బాధ అనేది అణుమాత్రమైనా ఉండదు, అంతా ఆనందమే ఉంటుంది. దేహముతో ఉన్నంత వరకే వారికి బాధ అనే అనుభూతిని అనుభవించే అవకాశముంటుంది. కావుననే అవతారులు సద్గురుకోర్కెను మన్నించి సద్గురుకర్మకు అవకాశమిచ్చి తద్వారా బాధ అనే అనుభూతిని అనుభవిస్తారు. అవతారుడు ఒప్పుకోకపోతే సద్గురువు అవతారుని దేహమును తన కర్మకు ఉపయోగించలేరు. సద్గురువు అవతారుడిని బ్రతిమాలి ఒప్పించియే అవతారుని దేహముతో కర్మ చేయాల్సియుంటుంది. అవతారులు బాధ అనే అనుభూతిని దేహముతో రుచి చూచుటకే సద్గురుకర్మకు అవకాశమిస్తారు. బాధ అనేది అవతారుని దేహమునకే అంటుతుంది గానీ మనస్సుకు గానీ, ఆత్మకు గానీ అంటదు. దేహము శిలువ వేయబడుచున్న సమయములో కూడా అవతారుని యొక్క మనస్సు, ఆత్మ అనంతమైన ఆనందముతో నిండిపోయియుంటాయి. చూచే వారికి ప్రభువు దేహము అనుభవిస్తున్న శిలువబాధయే గోచరిస్తుంది గానీ అదే సమయములో ప్రభువు యొక్క ఆత్మ, మనస్సు అనంతమైన ఆనందమును అనుభవించుచున్నాయనే సత్యము అవగతము కాదు. అవతారునికి దేహకర్మలన్నియు మాయయే. ఆనందస్వరూపమే అవతారుడు అయియున్నారు" అని శ్రీ గురుదేవులు సద్గురుతత్వమును గూర్చి తెలియచేసియున్నారు.

